క్లుప్తంగా

ఎండుగుంపాలెం చెరువు మరమ్మతుల ప్రారంభం



నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెంలో మంచినీటి చెరువు మరమ్మతులు ఆదివారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు సూరె సరస్వతి శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో గ్రామంలోని రెండు చెరువుల సమస్యను ప్రస్తావించారు. సాగర్ జలాలతో నింపినా ఉపయోగం లేదని, కలుషితమవుతాయని తెలిపారు. చెరువుల్ని శుభ్రం చేయాలని కోరారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. చెరువు శుభ్రం పనుల్ని ఆదివారం ప్రారంభించారు. నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో శుభ్రం చేయనున్నట్లు చెప్పారు.

బంగారం మాయంపై పోలీసుల విచారణ

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో బంగారు ఆభరణాల మాయంపై పోలీసులు విచారణ చేపట్టారు. బ్యాంక్ పరిధిలోని 49 మందికి చెందిన సుమారు రూ.1.52 కోట్ల విలువ చేసే 3149.42 గ్రాముల బంగారం మాయమైన సంగతి తెలిసిందే. దీనిపై బ్యాంక్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆదివారం బ్యాంక్‌లో బంగారు ఆభరణాలు కుదువ పెట్టి రుణాలు తీసుకున్న రైతులను రూరల్‌స్టేషన్‌కు పిలిపించారు. ఒక్కొక్కరి నుంచి పూర్తి వివరాలు నమోదు చేసుకున్నారు. కుదువపెట్టిన బంగారు ఆభరణాల వివరాలు, ఎంత మేర రుణం తీసుకున్నారు, బంగారు మాయమైన విషయం ఎలా తెలిసింది అనే అంశాలపై వారి నుంచి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిసింది. రుణాలు తీసుకునే సమయంలో బ్యాంకు సిబ్బంది వ్యవహార శైలి పైన ఆరా తీశారు. ఇప్పటికే బ్యాంక్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లను అనుమానిస్తూ బ్యాంక్ ఉన్నతాధికారులు విధుల నుంచి తప్పించారు. ఈ వ్యవహారంలో ఎంత మంది పాత్ర ఉందనే కోణంలోనూ పోలీసులు దృష్టి సారించారు. కొంతమంది రాజకీయనాయకుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంతో నమ్మకంతో రైతులు కుదువపెట్టిన బంగారం మాయం అవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మెడిసిన్ విద్యార్థికి స్నేహ హస్తాలు చేయూత

అచ్చంపేట: ప్రతిభతో మెడికల్ సీటు సంపాదించిన నిరుపేద విద్యార్థికి హాస్టల్ ఫీజు నిమిత్తం స్నేహ హస్తాలు ఫౌండేషన్ వారు సంఘ ప్రతినిధి మామిళ్లపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం రూ.50 వేల నగదుతోపాటు రూ.40 వేలు విలువచేసే లాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కో -ఆర్డినేటర్ తాయి కరీముల్లా బాబు మాట్లాడుతూ ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేని నిరుపేద విద్యార్థులకు తమ సంస్థ చేయూతనిస్తోందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన హారతి శివప్రియ ఒంగోలులోని ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదివేందుకు ఫ్రీ సీటు సాధించింది. ఫీజులు ప్రభుత్వం ఫీజు రీఇంబర్స్ మెంటు కింద చెల్లించగా, హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.50 వేలను తాము చెల్లిస్తున్నట్లు చెప్పారు. మెడిసిన్ పూర్తి అయ్యేంతవరకు విద్యార్థికి ప్రతియేటా హాస్టల్ ఫీజు తామే చెల్లించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మా శౌరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి

మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్. జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 23 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరుతో పాటు ఏ ఇంటికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారుల్ని పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాల్ని అందజేస్తోందని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని తెలిపారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాల్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వాటిని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీకాంత్, మేకపోతుల శివ, మేకపోతుల శ్రీరామ్, శివమ్మ, మేకపోతుల వీరాంజి, శ్రీరామ్ చలపతి, జల్లెడ ప్రసాద్, దాసరి ఈశ్వరరావు, మేకపోతుల అశోక్, కంచర్ల అశోక్, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగ ఫెడరేషన్ కార్యవర్గ ఎన్నిక



మణికాంత్



శాంతకుమారి

నాదెండ్ల: గ్రామ సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నియోజకవర్గ సమావేశాన్ని ఆదివారం నాదెండ్ల సచివాలయంలో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా నక్కా మణికాంత్, వైస్ ప్రెసిడెంట్లుగా షేక్ రబ్బాని, ఉప్పుటూరి గోపి, జనరల్ కార్యదర్శిగా ఫయాజ్, జాయింట్ సెక్రటరీగా పి. శ్రీను, కోశాధికారిగా షేక్ రిజ్వానా, కార్యవర్గ సభ్యులుగా మద్దిబోయిన వెంకటశ్రావణి, మొలమంటి ఝాన్సీ ప్రతాప్, బందా వినయ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బిరుదు శాంతకుమారి నియమితులయ్యారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, సాతులూరు గ్రామ సచివాలయ కార్యదర్శి ముదవర్తి రమేష్ బాబు, జిల్లా జనరల్ సెక్రటరీ బిట్రా కొండలరావు, ఉపాధ్యక్షుడు జగదీష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కారసాల మధు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు, రెడ్ల అన్నదాన సత్రం అధ్యక్షులు పులి ఓబుల్‌రెడ్డి

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఫిబ్రవరి 12 నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దుల బండలాగు ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు, రెడ్ల అన్నదాన సత్రం అధ్యక్షులు పులి ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి మందలపు వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పాలువాయి జంక్షన్‌లో వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సారథ్యంలో సత్రశాలలో వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంభ సమేత మల్లిఖారునస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న అఖిలభారత రెడ్ల కుల గురువు శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రం మైదానంలో ఈ ఎద్దుల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. మొత్తం 6 విభాగాలకు గాను ఒక్కొక్క విభాగంలో 7,8 బహుమతులు చొప్పున 41 బహుమతుల ద్వారా రూ.10.17 లక్షలు విజేతలైన రైతు సోదరులకు అందచేయడం జరుగుతుందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో పెద్ద సంఖ్యలో రైతన్నలు పాల్గొని విజయ వంతం చేయాలని వారు కోరారు. పూర్తి వివరాలకు : 9908775005, 8096154409, 9704005849 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రెడ్ల సత్రం ట్రెజరర్ నెవలి సీతారామిరెడ్డి, పత్తి కోటిరెడ్డి, యర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, పేరం వెంకటరామిరెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, చపారపు భాస్కర్‌రెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్దవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, చింతా శివారెడ్డి, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

వేదవ్యాస భగవానుని విగ్రహానికి జలాధివాసం



వేదవ్యాసవిగ్రహానికి పూజలు చేస్తున్న భవఘ్నిగురూజీ దంపతులు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామం సమీపంలో గల వ్యాససనాతన ధర్మక్షేత్రంలో వ్యాసభగవానుని విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాల్ని రెండవ రోజు ఆదివారం ఆగమశాస్త్రప్రకారం నిర్వహించారు. విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన ఉత్సవాల్లో వేదపండితులు ప్రధాన వేదికార్చనలో భాగంగా సోమనాథ పూజను నిర్వహించారు. యాగార్చన, నిత్యహోమాలు జరిపారు. అనంతరం ద్వాదశపాత్ర సాధన, తత్తత్ దేవతా మూల మంత్రహవనములు, ప్రతిష్ఠామూర్తులకు లక్ష్మణోద్ధారణం నిర్వహించారు. అనంతరం వేదవ్యాసభగవానుని విగ్రహానికి అష్టముత్రకాస్నపనం, నేత్రోన్మీలనం,దశమహా దర్శన దర్శనములు, సాయంత్రం ఐదుగంటలకు వ్యాససహస్రనామ హోమం, బింబ శుద్ధిపురస్కృత 108 బిందెల తోజలాధివాసం నిర్వహించారు. కార్యక్రమాల్లో భవఘ్నిగురూజీ దంపతులతో ప్రతిష్ఠ యాజ్ఞికబ్రహ్మ బ్రహ్మశ్రీ నందివెలుగు శ్రీబాలాజీ గురుకుల్ యాజ్ఞీక పర్యవేక్షణలో ఆగమశాస్త్రయుతంగ క్రతువుల్ని నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



విశేష అలంకరణలో శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి అమ్మవారు

నకరికల్లు: స్థానిక శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి కల్యాణ వేడుకలు, జ్యోతిమహోత్సవం, గ్రామోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని ఆలయంలోని అమ్మవారిని, స్వామివారిని విశేషంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు కొలువుదీరగా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ అమ్మమాలధారణ భక్తులు అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. పురవీధుల్లో గ్రామోత్సవం సాగగా, భక్తులు వార్లుపోసి మొక్కులు చెల్లించారు. గ్రామోత్సవం అనంతరం ఆలయంలో కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మస్వామి వేడుకలను పర్యవేక్షించారు. పలుగ్రామాల నుంచి తరలివచ్చిన అమ్మమాలధారణ భక్తులు కల్యాణవేడుకలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో నృత్యాలు చేస్తున్న అమ్మ మాలధారణ భక్తులు

జాతీయ క్యారమ్స్ పోటీలకు హర్షిత ఎంపిక



హర్షితను అభినందిస్తున్న ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: జాతీయ స్థాయి క్యారమ్స్ పోటీలకు ఏఎంజీ హైస్కూల్ విద్యార్థిని ఎం. హర్షిత ఎంపికైంది. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో క్యారమ్స్ పోటీలు ఇటీవల నిర్వహించారు. ఇందులో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థిని ఎం. హర్షిత విశేష ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు 47వ జూనియర్ నేషనల్ క్యారమ్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ముంబాయిలోని ధార్‌వాడ్ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ హాలులో నిర్వహిస్తారు. విద్యార్థిని హర్షితను ఆదివారం ఏఎంజీ ప్రాంగణంలో అభినందించారు. తమ విద్యార్థిని ఎంపిక కావడం గర్వకారణమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. సీఏవో మాశిలామణి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి జలీల్, హైస్కూల్ హెచ్‌ఎం పి. మేరి తదితరులు హర్షితను అభినందించారు.

టీడీపీ మునిగి పోయిన నావ

మంత్రి విడదల రజిని



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, టీడీపీ మునిగిపోయిన నావ వంటిదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో చలివేంద్ర బజార్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకుడు హనుమంతరావు మేస్త్రి తదితరులు మంత్రి విడదల రజిని సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి ఆదివారం చేరారు. వారికి మంత్రి విడదల రజిని వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాయుడు హనుమంతరావు, గంజికొట్టి రామారావు, కొండయ్య, సుబ్బారావు, దేగల ఆంజనేయులు, మేకపోతుల నాగరాజు, దేగల పరమేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తెల్లబాటి శ్రీనివాసరావు, నాయుడు సుబ్బారావు, గంజికొట్టి కోటేశ్వరరావు, సాంబయ్య, ఆంజనేయులు, బాణావాతు గోవింద్‌తో పాటు మొత్తం 55 మంది చేరారు.

ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

రెంటచింతల: శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఫిబ్రవరి 12 నుంచి 17వ తేదీ వరకు ఒంగోలు జాతి ఎద్దుల బండలాగు ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్న చేదోడు పథకానికి 175 మంది అర్హత

శావల్యాపురం: జగనన్న చేదోడు పథకానికి 11 గ్రామ సచివాలయాల పరిధిలో 175 మంది లబ్ధిదారులు అర్హత పొందినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. శానంపూడి-7, కారుమంచి-31, గుంటుపాలెం-10, కొత్తలూరు-5, మతుకుమల్లి-26, శావల్యాపురం-11, పిచికలపాలెం-9, కనమర్లపూడి-3, వేల్పూరు 1-31, వేల్పూరు 2-42 మంది అర్హత పొందినట్లు ఆయన వివరించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నరసరావుపేట: శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి (ఎస్‌కేఆర్‌బీఆర్) డిగ్రీ కళాశాలలో 1982–85లో బీఏ చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ అనుబంధాల్ని గుర్తు చేసుకున్నారు. కాలేజీ రోజుల్ని జ్ఞాపకం చేసుకున్నారు.తమ కుటుంబాల వివరాల్ని సభా ముఖంగా తెలియచేసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. తమకు చదువు చెప్పిన అప్పటి అధ్యాపకులు లంకా సత్యనారాయణ, మడకా సత్యనారాయణ, ఎం.కబ్బిరెడ్డి, సీహెచ్.మస్తాన్‌రెడ్డి, వి.వీరారెడ్డిని ఘనంగా సన్మానించారు.

నేడు గొరిజవోలులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలులో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

స్కూటీ పైనుంచి కింద పడి మహిళ మృతి

నాదెండ్ల: స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి జారిపడి గాయాలైన మహిళ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు... గణపవరం సీఆర్ కళాశాల సమీపంలో జిల్లా పరిషత్ క్వార్టర్‌లో నివాసం ఉండే కొత్తపల్లి సామ్రాజ్యం అలియాస్ పాల పాప (52) దుస్తుల వ్యాపారం నిర్వహిస్తుంటారు. బంధువుల వివాహ నిమిత్తం శుక్రవారం కావూరుకు స్కూటీపై మనవరాలితో వెళ్లారు. సాయంత్రం 5 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి సామ్రాజ్యం కింద పడింది. తొలుత 108 వాహనంలో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సంఘటన స్థలంలో మృతి చెందిన సంగారావు

దాచేపల్లి : ఆగి ఉన్న లారీని ఢీకొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని భవ్య పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో దానిపై ఉన్న పిడుగురాళ్ల మండలం వీరాపురానికి చెందిన కుర్ర సంగారావు(47) దుర్మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. వ్యక్తిగత పనుల నిమిత్తం దాచేపల్లికి ద్విచక్రవాహనంపై సంగారావు, మల్లికార్జునరావులు వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద ఆగిఉన్న లారీని అతివేగంగా ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. వాహనం నడుపుతున్న సంగారావు అక్కడికక్కడే మృతిచెందగా, మల్లికార్జునరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ తెలిపారు.

పాల ట్యాంకర్ ఢీకొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి...

పాల ట్యాంకర్ ఢీకొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన భవ్య పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగింది. సుమారుగా 60 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ద్విచక్ర వాహనంపై రోడ్డు పక్కన నిలబడ్డాడు. ఈ సమయంలో హైదరాబాద్ వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న పాలట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

అచ్చంపేట: మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసతండా, సట్టుబడి తండాలకు చెందిన 14 మంది నిరుపేద గిరిజన రైతులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం అటవీ భూహక్కు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అటవీ భూములపై తమకు హక్కు కల్పించాలని దశాబ్దాల కాలంగా గిరిజన రైతులు ఎదురు చూస్తున్నా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి విసికిపోయిన రైతులందరికి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.



లోకేష్ పాదయాత్రతో ప్రభుత్వానికే ప్రయోజనం

- లోకేష్‌ను ప్రజలపై రుద్దాలని చూస్తున్న చంద్రబాబు
- ఇస్లాంపేటలో గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


వార్డు ప్రజలకు సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: నారా లోకేష్ పాదయాత్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ప్రయోజనమని, ఆ పాదయాత్ర ఎన్నిరోజులైనా నిరభ్యంతరంగా చేసుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మూడోసారి ఆదివారం ఎనిమిదో వార్డు ఇస్లాంపేటలో పర్యటించారు. ఆయనకు వార్డు నాయకులు షేక్ కరీముల్లా, షేక్ ఖాజా, మాజీ కౌన్సిలర్ అబ్దుల్ సత్తార్, షేక్ రబ్బాని, మధిరా జబ్బార్, జాకీర్, సయ్యద్ ఫాతిమూన్ ఆధ్వర్యంలో ముస్లింలు ఘన స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లారు. ఇప్పటి వరకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వారు చెబుతున్న సమస్యల్ని వింటూ మనోభావాల్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ లోకేష్ వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలవకుండా దొడ్డిదారిన ఎమ్మెల్సీగా మంత్రి అయిన వ్యక్తి అని విమర్శించారు. ఒక మంత్రిగా పని చేసి ఎన్నికల్లో ఓడిపోయాడని ఎద్దేవా చేశారు. అతడ్ని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిగా ప్రమోట్ చేసేందుకు చంద్రబాబునాయుడు కలలు కంటున్నాడని తెలిపారు. పాదయాత్రకు హైప్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లోకేష్ భాష చూస్తుంటే అసలు తెలుగు వచ్చా ? అని ప్రశ్నించారు. జీవో అనటానికి జీయో అంటున్నాడని, ఇటువంటి వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పోటీనే కాదని చెప్పారు. ఇద్దరి మధ్యా నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా తానిచ్చిన హామీల్ని 98శాతం పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. లోకేష్ పరిస్థితి ఈనాడు జాకీ పెట్టిలేపే పరిస్థితిలో ఉన్నాడని, అతని భాష, శరీరతత్వం చూస్తే రాజకీయాలకు పనికిరాడని చెప్పారు. తన యాత్ర చూసి వైఎస్సార్ సీపీకి వణుకు పుడుతుందనే లోకేష్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. పెయిడ్ ఆర్టిస్టులతో చేసే పాదయాత్ర వల్ల తమ ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని, అది అట్టర్‌ఫ్లాప్ షో అని పేర్కొన్నారు. వార్డులో అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న తోడు, వసతి దీవెనతో పాటుగా 27 పథకాల్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారని వివరించారు. పట్టణంలో ఏ వార్డులో లేని విధంగా 430మందికి ఇళ్ల పట్టాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ డి.శ్రీనివాసరావు, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, మాజీ కౌన్సిలర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, నేలటూరి మురళి, మాడిశెట్టి మోహనరావు, షేక్ రెహమాన్, గేరా ధర్మారావు, టౌన్ కన్వీనర్ల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి, ఎన్‌కే ఆంజనేయులు, కాకుమాను మంగపతిరెడ్డి, ముద్దా కరీముల్లా, షేక్ దాదా, మారూరి శివారెడ్డి, హాలీవుడ్ రఘు, సయ్యద్ ఖాదర్ బాషా, షేక్ బాజి, ద్వారక పాల్గొన్నారు.






కల్యాణ మండపానికి విరాళం


చెక్‌ను ఈవో సుధాకరరెడ్డికి అందజేస్తున్న దాత అల్లూరి పేరయ్య

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెంలో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపానికి హైదరాబాద్‌కు చెందిన అల్లూరి పేరయ్య, సుమతి దంపతులు రూ.65వేల విరాళం అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం చెక్‌ను ఈవో టి.సుధాకరరెడ్డికి దాత పేరయ్య అందించారు. కల్యాణ మండపంలోని ఏసీ ఏర్పాటుకు చెక్‌ను దాత అందించినట్లు ఈవో తెలిపారు.దేవస్థానానికి అనుబంధంగా అభివృద్ధి చేస్తున్న కల్యాణ మండపంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు.

ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా ఏపీ) డైరీ, క్యాలెండర్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబు సుభానీ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మొహిద్దీన్ బాషా, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముజీబ్, సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





గిరిజనుల అభ్యున్నతికి సేవాలాల్ కృషి


సేవాలాల్ చిత్రపటాన్ని ఆవిష్కరించిన సంఘు నాయకులు

యడ్లపాడు: గిరిజనుల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి. శ్రీనునాయక్ పేర్కొన్నారు. యడ్లపాడు సుగాలీ కాలనీలోని మేరమ్మ ఆలయంలో ఆదివారం సంత్ సేవాలాల్ 284వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుగాలీల ఆరాధ్యదైవమైన సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న బోయపాలెం ఎస్టీకాలనీలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు, యడ్లపాడు మండల అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌నాయక్, చిలకలూరిపేట పట్టణ గౌరవ అధ్యక్షుడు బి. చిన్నానాయక్, సహాయ కార్యదర్శి దేవర డేవిడ్, నాయకులు ఆర్. శంకర్‌నాయక్, ఆర్. కన్నయ్యనాయక్, ఆర్. శివ నాయక్, యం. శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన పూజలు


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): శ్రీ వేదమాత అర్చక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో వినుకొండ పాత శివాలయంలో ఆదివారం సప్తమ వార్షిక లక్ష బిల్వార్చన, అమ్మవారి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అర్చకులు, పురోహితులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలపర్తి సుబ్బయ్య, యడవల్లి శ్రీనివాసరావు, అరిపిరాల శివ, జె.రాంబాబు, తెలికేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్నారుల పరుగు పందెం పోటీలకు స్పందన


పోటీలు నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వాసవీ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని సరోజినీనాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆదివారం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయ్యప్పస్వామి దేవస్థానం కమిటీ గౌరవాధ్యక్షుడు గంధం వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ దేశ సంస్కృతి, వారసత్వాన్ని చిన్నారులకు పాఠశాల విద్య నుంచే అందించాలని తెలిపారు. పోటీల్లో విజేతలకు పాఠశాలలో సోమవారం నిర్వహించనున్న మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తాడువాయి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు మునగాల చిరంజీవి, రాధిక, వెల్లంపల్లి కేశవరావు, హెచ్‌ఎం గోవిందనాయక్, నాగమణి పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం కావాలని కోరుతూ ప్రార్థనలు


ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ఫిలిప్

వినుకొండ(నూజెండ్ల): జగనన్న చేదోడు 3వ విడత ప్రారంభోత్సవం సందర్భంగా వినుకొండ వస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పర్యటన విజయవంతం కావాలని కోరుతూ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్ ఆధ్వర్యంలో స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో సోమవారం వెల్లటూరు రోడ్డులోని ఘాట్ రోడ్డు వద్ద నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ విజయవంతం కావాలని చర్చి పాస్టర్ రెవరెండ్ పత్రా ఫిలిప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు బేతం శ్యాంప్రసాద్, కార్యదర్శి పి.ఫిలిప్, కోశాధికారి కె.కాలేబురాజు, సంఘ పెద్దలు చాట్ల రామయ్య, సురభి జోసెఫ్, పులుగుజ్జు వరప్రసాద్, గద్దల ఆశీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేయర్ టవర్‌కు నామ ఫలకం వితరణ

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలోని ప్రేయర్ టవర్‌కు పట్టణానికి చెందిన దాసరి జార్జి విన్సెంట్, జ్యోతి జాస్మిన్ ఆదివారం రూ.25వేలు విలువైన నేమ్ బోర్డు(నామ ఫలకం)ను ఆదివారం అందజేశారు. సంఘ కాపరి రెవరెండ్ పత్రా ఫిలిప్ ప్రత్యేక ప్రార్థనలు చేసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.





